# నిజాయితీగా వ్యాపారం చేయండి

లేదంటే చర్యలు తప్పవు

2లో

వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 46    గురువారం | 10 ఆగస్టు 2023 | పేజీలు : 08 | వెల రూ. 5

# 'బీజేపీ'లో కల్లోలం

2లో




- రాష్ట్రంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- కిషన్ రెడ్డి పగ్గాలు చేపట్టాక ప్రభావం నిల్
- ఒక్కొక్కరుగా పార్టీ వీడుతున్న వైనం
- అయోమయంలో పార్టీ శ్రేణులు

కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు భారతీయ జనతా పార్టీకి చెందిన పలువురు సిద్ధపడటంతో ఆ పార్టీలో కల్లోలం మొదలైందనే చర్చ సాగుతోంది. ఇప్పటకే ఆ పార్టీలో చేరిన వారంతా సరైన గుర్తింపు లభించడంలేదన్న సాకుతో బీఆర్ఎస్ లేదా కాంగ్రెస్‌లో చేరిపోతున్నారు. విజయశాంతి కూడా మళ్లీ కాంగ్రెస్ గూటిలో చేరుతారన్న ప్రచారం సాగుతోంది. మెదక్‌లో మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి బీజేపీ నుంచి ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ పగ్గాలు అప్పగించాక పార్టీ శ్రేణుల్లో స్తబ్దత నెలకొంది. గతంలో ఉన్న ఊపు కనిపించడంలేదు. చేరికల సంగతి ఎలా ఉన్నా ఉన్నవారిని కాపాడుకోవడం ఆ పార్టీకి పెద్ద సమస్యగా మారింది. ఎవురు ఉంటారో.. ఎవరు పోతారో చెప్పలేని అయోమయ పరిస్థితి నెలకొంది. దీంతో దిగువ స్థాయి పార్టీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది. - వరంగల్ వాయిస్, వరంగల్

# మంత్రి ఎదుటే ఆత్మహత్యాయత్నం

అడ్డుకున్న పోలీసులు

వారసత్వ ఉద్యోగం తనకే ఇవ్వాలంటూ డిమాండ్

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన విఆర్ఏ నియామక పత్రాల పంపిణీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. తనకు వారసత్వంగా రావాల్సిన ఉద్యోగాన్ని ఇతరులకు కేటాయించడంతో మనస్థాపానికి గురైన నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామానికి చెందిన షేక్ సలీం మంత్రి సత్యవతి రాథోడ్ సమక్షంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. గుర్తించిన పోలీసులు హుటాహుటిన షేక్ సలీంను అక్కడినుంచి తరలించారు. తన తండ్రి హుస్సేన్ ఉద్యోగం వారసత్వంగా తనకు దక్కాల్సి ఉన్నప్పటికీ డిప్యూటీ తహశీల్దార్ తరంగిణి డబ్బులు తీసుకొని అర్హత లేకున్నా యాకుబ్ పాషాకు పోస్టింగ్ కేటాయించారని ఆరోపించారు. తన వారసత్వ ఉద్యోగం తనకు ఇవ్వాలని బాధితుడు డిమాండ్ చేశారు.

-వరంగల్ వాయిస్, మహబూబాబాద్



# విద్యా రంగానికి పెద్దపీట

మంత్రి సత్యవతి రాథోడ్

అప్ గ్రేడ్ జూనియర్ కాలేజీ తరగతుల ప్రారంభం



2లో

# బీజేపీలో కల్లోలం

**రాష్ట్రంలో మారుతున్న సమీకరణాలు**
**కిషన్ రెడ్డి పగ్గాలు చేపట్టాక ప్రభావం నిల్**
**ఒక్కొక్కరుగా పార్టీ వీడుతున్న వైనం**
**అయోమయంలో పార్టీ శ్రేణులు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగురవేస్తామన్న భారతీయ జనతా పార్టీ శ్రేణులు చల్లబడ్డారు. అప్పటి ఊపు కనిపించడం లేదు. రాష్ట్ర స్థాయిలో అధికార పార్టీకి వ్యతిరేకంగా ఒక్క కార్యక్రమం కూడా చేపట్టకపోవడంతో వారిలో అయోమయ పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో ఇప్పటి వరకు బీజేపీలో చేరిన వారు ఒక్క రొక్కరుగా పార్టీ వీడడంతా ఆ పార్టీలో కల్లోలం మొదలైంది. అధికారం దేవుడెరుగు..అసలు ఉన్న ఉనికిని కోల్పోతారా అన్న చర్చ సాగుతోంది. పార్టీని వీడుతున్న వారిని కాపాడుకోవడం బీజేపీకి పెద్ద సమస్యగా మారింది. జయసుధ లాంటి వారు బీజేపీలో చేరినా పెద్దగా లాభం కనపడం లేదు. ఇకపోతే తమ ప్రత్యర్థి కాంగ్రెస్ అన్న సంకేతాన్ని ఇప్పటికే బీఆర్ఎస్ ఇచ్చింది. ఇటీవలి అసెంబ్లీలో వ్యవహారమంతా కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ సాగింది. కాంగ్రెస్‌ను విమర్శించడానికే అసెంబ్లీ సమావేశాలు జరిగాయన్న వాదనా ఉంది. దీంతో నియోజకవర్గాల్లో కూడా బీజేపీపై ఆశలు సన్నగిల్లడంతో కింది స్థాయి కార్యకర్తలు కాంగ్రెస్, బీఆర్ ఎస్ వైపు చూస్తున్నారు.

## వికటించిన వ్యూహం..

సాధారణ ఎన్నికలకు మరో నాలుగు నెలల సమయం ఉంది. ఇప్పటికే పరిణామాలు మారుతున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో మార్పులు వస్తున్నాయి. బీజేపీ కూడా ఇదే కోరుకుంటోంది. బీజేపీ వ్యూహంలో భాగంగా ముందుగా కాంగ్రెస్ పార్టీని బలహీనపరచిన తద్వారా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచేలా లోపాయకారి ఒప్పందం చేసుకుందన్న ప్రచారం సాగుతోంది. భారత రాష్ట్ర సమితిని దెబ్బ తీయాలన్న వ్యూహం నుంచి ఇప్పుడు కాంగ్రెస్ ను దెబ్బతీయాలన్న వైఖరితో బీజేపీ ముందుకు సాగుతోంది. ఇదే బీజేపీ పెద్దల అసలు వ్యూహంగా కనిపిస్తోంది. నరేంద్ర మోదీ, అమిత్ షాల వ్యూహం కూడా ఇదే. అయితే కర్నాటక ఫలితాలు వచ్చేవరకు బీజేపీ వైపు చూసిన వారంతా నేడు కాంగ్రెస్ కండువాలు కప్పుకుంటున్నారు. అదే విధంగా రాష్ట్ర చీఫ్ గా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీలో ఊపు తగ్గిందన్న ప్రచారం సాగుతోంది. బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పాదయాత్రలతో ప్రజలకు పార్టీని మరింత చేరువ చేశారు. గతంలో పార్టీకి దూరంగా ఉన్న వారు సైతం కాషాయ కండువా కట్టుకొని పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేశారు. నేడు పార్టీని నడిపించే నాయకుడు కరువయ్యాడన్న ప్రచారం సాగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ మరింత బలహీన పడే ప్రమాదం ఉందని పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్..

రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అంటూ ప్రజల ముందుంచుతున్నారు. రేవంత్ నాయకత్వంపై ముందునుంచి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహంగా ఉన్నారు. దీంతో వెంకట్‌రెడ్డి వికెట్ కూడా బీజేపీ ఖాతాలో పడుతుందని అంతా అనుకున్నారు. కానీ కాంగ్రెస్‌కు సానుకూల వాతావరణం రావడంతో ఆయన కొంత వెనక్కి తగ్గారనన్న ప్రచారం సాగుతోంది. భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకత్వం పన్నిన వ్యూహంలో భాగంగా మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక రావడం.. అందులో రాజగోపాల్ రెడ్డి ఓడిపోవడం ద్వారా వెంకట్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. ఈ క్రమంలో తెలంగాణ కాంగ్రెస్‌లో పరిణామాలు ఏ రకంగా మారతాయనే చర్చ రాజకీయవర్గాల్లో జోరందుకుంది. మరోవైపు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరింతగా రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసే అవకాశం ఉందని రాజకీయవర్గాల్లో ప్రచారం సాగుతోంది. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తీసుకుంటున్న పలు నిర్ణయాల పట్ల అసహనంగా ఉన్నారని చర్చ మొదల్కొంది. ఈ వ్యాఖ్యలను కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఖండిస్తున్నా.. తాను పార్టీని వీడితే.. అందరికీ చెప్పే వెళతానని అంటున్నారు. అయితే వారు ఏ మేరకు కాంగ్రెస్‌కు డ్యామేజ్ చేస్తారన్నదే ముఖ్యం. ఇకపోతే తెలంగాణలో కాంగ్రెస్ నుంచి ఎదురవుతున్న గట్టి సవాళ్లను తక్కువగా చేయడానికిలేదు. బీఆర్ఎస్‌కు ఉనికి లేకుండా చేయడం ద్వారా కేసీఆర్ పాలనకు తెరదించాలన్న కక్షతో కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఈ సవాల్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ఎలా ఎదుర్కొంటారన్నదే ఇప్పుడు సర్వత్రా ఆసక్తి కలిగిస్తోంది. బీజేపీని వ్యతిరేకిస్తున్న వారు కేసీఆర్ సవాళ్లను సమర్థిస్తున్నా..ఆయనతో గట్టిగా కలసి నడిచేందుకు ఎవరు కూడా అడుగు వేయడం లేదు. మరోవైపు జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలనుకుంటున్న కేసీఆర్‌కు పెద్దగా ప్రాధాన్యం లేకుండా పోయింది. అయితే దీనికి కేసీఆర్ కూడా ప్రతివ్యూహం పన్నే అవకాశం లేకపోలేదు. ప్రస్తుత రాజకీయాలను కేసీఆర్ ఎలా ఎదుర్కొంటారా అన్నది చర్చగా మారింది. ఇంట గెలిచి రచ్చ గెలవాలి అంటారు. జాతీయ రాజకీయాల సంగతి ఏమోగానీ, కేసీఆర్‌కు ఇప్పుడు స్వరాష్ట్రంలోనే సవాళ్ళు ఎదుర్కోవాల్సి వస్తోంది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రాజకీయ భవిష్యత్తును దెబ్బతీసేందుకు ఒరిజనల్ కాంగ్రెస్ నేతలంతా ఒక్కటవుతున్నారు. అందుకే రేవంత్ భవిష్యత్ కూడా రానున్న ఎన్నికలతో ముడిపడి ఉంది. మొత్తంగా సవిరీకరణాలు ఎలా మారనున్నాయో వేచి చూడాల్సిందే.

# నిజాయితీగా వ్యాపారం చేయండి

## లేదంటే చర్యలు తప్పవు

## వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిజాయితీగా వ్యాపారం చేయండి లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవంటూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న వాహనచోరీల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ట్రై సిటీ పరిధిలోని పాత సామాను కొనుగోలు వ్యాపారస్థులతో పాటు ఆటో కన్సల్టెన్సీ నిర్వాహకులతో గురువారం బీమారంలోని శుభం కళ్యాణ వేదికలో పోలీస్ కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చోరీకి గురైన ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయడం ద్వారా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలతోపాటు దేశానికి ఏవిధంగా నష్టం వాటిల్లుతుందో పోలీస్ కమిషనర్ వ్యాపారస్తులకు వివరించారు. పాత సామానుల కొనుగోలు దారులు సంపాదనే లక్ష్యంగా చోరీకి గురైన వాహనాలను కొనడం తగదన్నారు. మధ్యతరగతి ప్రజలు అధికంగా వినియోగించే ద్విచక్ర వాహనాన్ని దొంగల నుంచి కొనుగోలు చేసి వాటిని తుక్కు రూపంలో తరలించడం మానుకోవాలని హితవు పలికారు. ఎదైన పాత వాహనం కొనుగోలు చేసే సమయంలో తప్పని సరిగా వాహనం విక్రయించే వ్యక్తులకు సంబంధించి ఆధార్ లాంటి గుర్తింపు కార్డులతో పాటు, వారి సెల్ ఫోన్ నంబర్ తీసుకోవాలని, వాహనం కొనుగోలు చేసే సమయంలోనే వారికి ఫోన్ చేసి నిజనిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఒరిజినల్ పత్రాలు ఉంటేనే వాహనాలను కొనుగోలు చేయాలని, ప్రతి వ్యాపార కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైన వ్యాపారస్తులు చట్టవ్యతిరేకంగా వాహన కొనుగోలుకు పాల్పడితే వారిపై పిడియాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ దాసరి మురళీధర్, ఏసీపీలు మల్లయ్య, రమేష్ కుమార్, కిరణ్ కుమార్, డేవిడ్ రాజు, సతీష్ బాబుతో పాటు ఇన్ స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

### ఒరిజినల్ ధ్రువపత్రాలుండాలి..

వాహనదారులు తాము ప్రయాణించేసమయంలో వాహనానికి సంబంధించి ఒరిజినల్ ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజలకు సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా ఇది తప్పని సరని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# విద్యా రంగానికి పెద్దపీట

## మంత్రి సత్యవతి రాథోడ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులంలో నూతనంగా అప్ గ్రేడ్ చేసిన జూనియర్ కాలేజీ తరగతులను గురువారం రాష్ట్ర గిరిజన, స్త్రీ – శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ గురుకులాలు దేశానికే తలమానికంగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 188 గిరిజన గురుకులాల్లో విద్యార్థులు సకల సౌకర్యాలతో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. జిల్లాలో రూ.12 కోట్లతో బాలికలకు ప్రత్యేక గురుకుల పాఠశాల మంజూరైందని, త్వరలోనే భవనాన్ని కూడా ప్రారంభించనున్నట్లు ఆమె ప్రకటించారు. గురుకులాల్లో చదివే విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, ఎన్ఐటీ విద్యాసంస్థల్లో సీట్లు పొందుతున్నారన్నారు. త్వరలో ఇక్కడ కూడా వృత్తివిద్య కోర్సులు ప్రవేశపెడతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ శశాంక, ఆర్ సీఓ రాజ్యలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### వీఆర్ఏలకు ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ..

వీఆర్ఏలకు ఉద్యోగ నియామక పత్రాలను గురువారం రాష్ట్ర గిరిజన, స్త్రీ – శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా అందజేశారు. జిల్లాలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బానోత్ శకర్ నాయక్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ శశాంక, అదరపు కలెక్టర్ డేవిడ్, జడ్పీ సీఈవో రమాదేవి, పంచాయతీ శాఖ అధికారి నర్మద, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 13న కాకతీయ వైభవ కీర్తి పురస్కారాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వేయి సంవత్సరాల క్రితం సువిశాల కాకతీయ సామ్రాజ్యాన్ని ప్రజా రంజకంగా పాలించి కళలను, సాహిత్యాన్ని ప్రోత్సహించి కవులకు, కళాకారులకు ప్రేరణగా నిలిచిన కాకతీయ వైభవాన్ని ఈ తరానికి తెలియజేయాలన్న సంకల్పంతో ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్ లోని మహేంద్ర షోరూం పైనున్న నందన బంకెట్ హాలులో కాకతీయ వైభవ కీర్తి పురస్కారాల పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ఫిలాంతరఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా, పుడమి సాహితీ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఫిలాంత రఫిక్ సొసైటీ ప్రతినిధి, కార్యక్రమం నిర్వాహకులు డాక్టర్ అద్దంకి రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా టామా సంస్థ ప్రతినిధి చిగురుమల్ల శ్రీనివాస్, పుడమి సాహితీ వేదిక– చిలుముల బాల్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు, కళా రత్న డాక్టర్ ఎస్పీ భారతి, రాజవంశీకుల, ప్రాచీన కవుల వారసులతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర్ తిలక్, అసిస్టెంట్ డైరెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ జి.లక్ష్మణ్, పౌర సంబంధాల శాఖ విశ్రాంత సూపర్ వైజర్ జి..విధుమౌళి, సీనియర్ జర్నలిస్టు పీవీ మదన్ మోహన్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి మామిడాల శశిరేఖ తదితరులు పాల్గొంటారన్నారు. కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సాంస్కృతిక వేడుకను జయప్రదం చేయాలని డాక్టర్ అద్దంకి రాజా కోరారు.



# రక్తదానం ప్రాణదానంతో సమానం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రక్తదానం ప్రాణదానంతో సమానమని సాయిబాబా మందిర్ చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ అన్నారు. గురువారం మందిరంలో ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ డాక్టర్ ఆశా దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 26యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మందిర ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, రాకం సదానందంలతో పాటు రికార్డ్ సర్వీస్ సొసైటీ కుసుమ కవిత, ఓరుగల్లు వాకర్ అసోసియేషన్ పేరుకారి శ్రీధర్ రావు, బ్లడ్ మోటివేటర్ రచ్చ కళ్యాణి, సిబ్బంది ప్రేమలత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. బుధవారంమండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ప్రధాన సమస్యలు కళాశాలలో వాష్ రూమ్స్, మరుగుదొడ్లు పనిచేయడం లేదన్నారు. విద్యార్థులకు తరగతి గదులలో ఫ్యాన్స్, లైట్స్, బెంచీలు సరిపడా లేవన్నారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు అనేకమైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న విద్య రంగ సమస్యలను కేసీఆర్ ప్రభుత్వం పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని విద్యార్థులే గద్దె దింపుతారని హెచ్చరించారు.

**కళాశాల నూతన కమిటీ ఎన్నిక..**

ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యక్షుడిగా ఎండీ నజీర్, ప్రధాన కార్యదర్శిగా చరణ్, ఉపాధ్యక్షులుగా ఎండీ ఈసమ్యుల్, టి.రాజ్ కుమార్, సహాయ కార్యదర్శిగా ఈ తిలక్, కమిటీ సభ్యులుగా నాగరాజు, శ్రీరామ్, అరుణ్, కుమార్, రాజేష్, లక్ష్మణ్, గణేష్, నవీన్ తదితరులను ఎన్నుకున్నారు.

# ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా : నాగుర్ల



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల నియోజకవర్గం నడికూడ మండలం నర్సక్కపెల్లి గ్రామానికి చెందిన లటికే శ్రీనివాస్ తండ్రి లటిక రాజయ్య అనారోగ్యం పాలై వరంగల్ లోని ఎంజీఎం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు వరంగల్ లోని ఎంజీఎం హాస్పిటల్ కు వెళ్లి రాజయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆపద కాలంలో ఉన్న వారికి అండగా ఉంటానని అన్నారు. అనారోగ్యానికి కారణాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మనో ధైర్యంగా ఉండాలని, వారి కుటుంబానికి ధైర్యం ఇచ్చారు. ఇంకా ఎటువంటి అవసరం ఉన్నా గాని నన్ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వారితో పాటు చిరంజీవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల :** కనుమరుగవుతున్న కుల వృత్తులకు ప్రోత్సాహం అందించాలనే సదుద్దేశంతో కుల వృత్తుల చేయూతకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్ దని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు అన్నారు. గురువారం నియోజకవర్గంలోని పరకాల మున్సిపాలిటీ, పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, గీసుగొండ, సంగెం మండలాలకు చెందిన 300మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే లక్ష రూపాయల సహాయ చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మన రాష్ట్ర సంక్షేమ పథకాలు నిలిచాయన్నారు. సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటూ దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రాన్ని నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దని కొనియాడారు. తెలంగాణ ప్రజల కళలను సాకారం చేయడానికి సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. 70 ఏండ్లకు పైగా పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏం చేసిందని ప్రశ్నించారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజా సంక్షేమంకోసం సంక్షేమ పథకాలు, రైతాంగ పురోగతి రైతు సంక్షేమ పథకాలు, కనుమరుగవుతున్న కులవృత్తుల ప్రోత్సాహకాలు అందిస్తూ వారికి అండగా నిలిచింది కేసీఆర్ ఒక్కరేనన్నారు. అనునిత్యం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తున్న కేసీఆర్ వెంట మనమందరం నడవాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల కుట్రలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. త్వరలోనే దళిత బంధు అందిస్తామని, అర్హులందరికీ గృహలక్ష్మి పథకం వర్తింపచేస్తామని అది నిరంతర ప్రక్రియ అని ప్రజలు అసత్య ప్రచారాలు నమ్మి ఆందోళన చెందవద్దని తెలిపారు. కుల వృత్తుల ఆర్థిక సహాయం పొందిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మార్కెట్, సొసైటీ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



**లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ..**

వరంగల్ వాయిస్, పరకాల : అన్నివర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారనీ పరకాల శాసన సభ్యుడు చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం హనుమకొండలోని వారి నివాసంలో గీసుగొండ, సంగెం మండలాలకు చెందిన మైనార్టీ రుణాలు పొందిన 15మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..అర్హులందరికీ గృహలక్ష్మి పథకం వర్తింప చేస్తామని, ప్రతిపక్ష పార్టీల నాయకులు కావాలనే ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రజలు అలాంటివి నమ్మవద్దని, గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని ఇప్పటికే మంత్రులు తెలిచేసినట్లు తెలిపారు. గ్రామాల్లో బీజేపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. గతంలో పరిపాలించిన పార్టీలు ముస్లింలను కేవలం ఓటు బ్యాంక్ గానే చూశాయని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ మైనార్టీ అభివృద్ధి సంక్షేమానికి రూ.220కోట్లు కేటాయించారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులను గ్రామాల్లో నిలదీయాలన్నారు. వారు పాలిస్తున్న రాష్ట్రాల్లో ఏ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారో ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో చెర్లపాలెం లోని బీసీ బాలుర వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు సమస్యలతో స్వాగతం చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ హాస్టల్ సందర్శించిన కనీస సౌకర్యాలు లేని పరిస్థితి వచ్చిందని అన్నారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులకు ఇవ్వాల్సిన గ్రాంట్లు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థులపై సవితి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. ఈ మధ్య కాలంలో మెస్ చార్జీలు పెంచుతామని ప్రకటించినా, అమలు కాని పరిస్థితి ఉందన్నారు. కావున తక్షణమే జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అమీర్, నాయకులు మహేష్, వినయ్, వాసు, వంశీ పాల్గొన్నారు.

# బీజేపీ బోపేతానికి పార్టీలో చేరండి

## మాజీ ఎమ్మెల్యే మొలుగూరి



**వరంగల్ వాయిస్, పరకాల :** నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ ఈనెల 19 శనివారం సాయంత్రం పరకాల పట్టణంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో పార్టీలో చేరవలసిందిగా మర్యాదపూర్వకంగా రాయపర్తి గ్రామానికి చెందిన మల్లకపేట హనుమాన్ టెంపుల్ మాజీ చైర్మన్ చేనుమల్ల సాంబారెడ్డి, ఎస్సారెస్పీ కెనాల్ మాజీ చైర్మన్ పర్నేం రవీందర్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు బీఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షుడు కోరం శ్రీనివాసరెడ్డి, గ్రామ ప్రజలను, యువతను పలువురిని పరకాల మాజీ శాసనసభ్యుడు మొలుగూరి భిక్షపతి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దుబాసి వెంకట స్వామి, మూల తిరుపతి రెడ్డి, మల్లారెడ్డి, బలబద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌వి మోసపూరిత వాగ్దానాలు

## కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్

**వరంగల్ వాయిస్, నడికూడ :** అమలు సాధ్యం కాని మోసపూరిత వాగ్దానాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తోందని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కేసీఆర్ కుట్రతో కూడిన వాగ్దానాలకు ప్రజలు ఎక్కడ మోసపోతారో అని భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతే ప్రజలను మోసం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. ఈ విషయమై సుప్రీంకోర్టు, హైకోర్టులు సుమోటోగా కేసులు స్వీకరించి ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్ పాలనలో ఆర్థికాభివృద్ధి, యువత భవిష్యత్తు నిర్వీర్యమైపోయిందని, ప్రజల భవిష్యత్తు దృష్ట్యా న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నాగర్ కర్నూల్ లో గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని నమ్మబలికారని, ఆ తరువాత మొన్న రూ.3 లక్షలు ఇస్తామని చెప్పి దగా చేశారని ఆరోపించారు. మూడు రోజుల్లో దరఖాస్తు చేసుకోమని చెప్పి ఆ తర్వాత ఇది నిరంతర ప్రక్రియ అంటూ మంత్రి ప్రశాంత్ రెడ్డి కొత్త పాట అందుకున్నారని అన్నారు. ఆగస్టు 19, 2014లో సమగ్ర కుటుంబ సర్వే అంటూ హడావిడి చేసి జనాలను వెర్రి పప్పులు చేశారని మండిపడ్డారు. బీసీలకు లక్ష రూపాయల రుణం, దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు, గిరిజన బందు హామీలన్నీ గాలికి కొట్టుకుపోయాయన్నారు. ఇకనైనా ప్రజలు కళ్లు తెరిచి వాస్తవాలను గ్రహించి మళ్లీ మోసపోవద్దని ప్రజలను అభ్యర్థించారు. ఈ విషయమై న్యాయ నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేధావులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.



# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో షీ టీమ్ అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అఫ్ పోలీస్ కంచి విద్యాసాగర్ అన్నారు. గురువారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, గౌట్ హై స్కూల్ లో దాదాపు 250మంది విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ 1930కి పిర్యాదు చేయాలని, తెలియని నెంబర్ నుంచి మహిళలకు ఎవరి నుంచైనా ఇబ్బందులుకు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270 లకు ఫిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి చర్య తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థులు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఎం రత్నాకర్ రాజు, జీవి అనిత, ఎం రాజేష్ కుమార్, పి.మధుకర్, నవనీత్ యాదవ్, షీ టీమ్ ఎస్ఐ విద్యాసాగర్, హెడ్ కానిస్టేబుల్ బిచ్య నాయక్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన ఎమ్మెల్యే అరూరి రమేష్ కృషి

### వర్దన్నపేట 30 పడకల అస్పత్రి 100 పడకల అస్పత్రిగా అప్ గ్రేడ్

### జీవో జారీ చేసిన మంత్రి హరీష్ రావు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్దన్నపేట ప్రజల చిరకాల కోరిక నెరవేరింది.. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కళ సాకరం అవుతోంది.. ఎమ్మెల్యే అరూరి రమేష్ కృషి ఫలించింది. వర్దన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని 30పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అస్పత్రిని 100పడకల ఏరియా అస్పత్రిగా మార్చాలని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి, మంత్రి హరీష్ రావు దృష్టకి తీసుకువెళ్లడమే కాకుండా అసెంబ్లీ సమావేశాలలో సైతం బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్దన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రస్తావించారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి హరీష్ రావు వర్దన్నపేటలోని 30పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అస్పత్రిని 100పడకల ఏరియా అస్పత్రిగా మార్చుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అస్పత్రి అభివృద్ధికి రూ.26కోట్లలతో పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీవో జారీ చేశారు. దీనికి సంబంధించిన జీవో కాపీని మంత్రి హరీష్ రావు ఎమ్మెల్యే అరూరి రమేష్ కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు కు ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వీటితో పాటు వర్దన్నపేట నియోజకవర్గ పరిధిలోని కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం ఏర్పాటు చేయడంతో పాటు హసన్ పర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 50 పడకల అస్పత్రిగా మార్చాలని మంత్రిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే దానికి అవసరమైన నిధులు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## చిన్నారులకు ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండలంలోని గాలివారిగూడెం గ్రామంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. చిన్నారులకు చేయూత నివ్వండి అని వరంగల్ వాయిస్ పత్రికలో వచ్చిన కథనానికి చలించిపోయిన కిసాన్ పరివార్ సంస్థ అధినేత, డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు భూపాల్ నాయక్ తన అనుచరులతో రూ.3వేల ఆర్థికసాయంఅందజేశారు. పిల్లల సంరక్షణలో భాగంగా రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు కార్పొరేట్ విద్యను అందంచనున్నట్లు భూపాల్ నాయక్ అనుచరుడు వెంకన్న, సంజీవ్‌లు తెలిపారు.

## దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాద్ లో మలక్ పేట పోలీస్ స్టేషన్ ముందు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన విజయ్ మృతి చెందారు. తన భార్యను ఎంఐఎం పార్టీకి చెందిన ఫారూఖ్ అతని స్నేహితులు వేధింపులకు గురి చేస్తున్నారంటూ వారం రోజుల క్రితం మలక్ పేట పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో విజయ్ తన భార్యతో వెళ్లి పోలీస్ స్టేషన్ ముందు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విజయ్ ను అతని భార్య ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా వారం రోజుల పాటు పోరాడి చివరికి మృతి చెందాడు. దీనికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, ఎంఐఎం పార్టీకి చెందిన వారి పైన కేసు నమోదు చేయాలని, వెంటనే వారిని అరెస్టు చేయాలని, దళితుల పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు నిరసనగా నగరంలోని 43వ డివిజన్ నాయుడు పంపు జంక్షన్ లో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా ఆదేశానుసారం దిష్టిబొమ్మ దహనం చేశారు. చనిపోయిన విజయ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, రూ.50లక్షల పరిహారం, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బన్న ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు, బీజేపీ నాయకులు మాడుగుల రాజకుమార్, మైదం వీరస్వామి, ఎర్ర రాములు, మన్నె సాంబయ్య, ఊసిల్ల సుధాకర్, తాళ్లపల్లి చంద్రశేఖర్, బన్న అనిల్, మైదాం బన్న ఐలయ్య, కుశల దయాకర్, ఎట్లా ఐలయ్య, బండ నాగరాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నుంచి సుమారు 30మంది ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ అరూరి విశాల్ సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. విశాల్ బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీకటి జయశంకర్, ముస్కు వంశీ, రాజేష్, సాయినాథ్, శ్రీమాన్ , శ్రీధర్ , విష్ణు అరుణ్, రాజేష్, లక్ష్మణ్ మణికంఠ, బొక్క కార్తీక్, మధు, శివ, గణేష్ తదితరులకు విశాల్ పార్టీ కండువా కప్పడం జరిగింది. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ప్రజా సంక్షేమమే ఎజెండాగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు , యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్ కార్యాలయంలో అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘనపురం అంజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్ మాట్లాడుతూ రేపటి అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ మహోత్సవానికి నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు, యువజన కాంగ్రెస్,ఎన్ఎస్ యూఐ, ఎస్సీ, ఎస్టీ, బీసీ అనుబంధ సంఘాల నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అధిక సంఖ్యలో హాజరై పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నూనవత్ రాధ, అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘనపురం అంజయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న, ఎస్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రసాద్ నాయక్, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు హారుణ్, జిల్లా నాయకులు రామిశెట్టి వీరేందర్, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు రియాజ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ నాయక్, ఇస్లావత్ రమేష్, భాస్కర్ నాయక్, ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ తూళ్ల ప్రణయ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు భూక్య విజయ, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు త్వరితగతిన నాటాలి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి సమీక్ష సమావేశం జరిగింది. తెలంగాణ హరితహారంలో భాగంగా గ్రామ పంచాయతీ టార్గెట్ వారీగా మొక్కలను త్వరిత గతిన నాటాలని అడిషనల్ డీఆర్డీఓ వసుమతి అన్నారు. పండ్ల తోటల పెంపకానికి ప్రతి గ్రామ పంచాయతీలో 10ఎకరాల వరకు లబ్ధిదారులను గుర్తించాలని ఎంపీడీవో చక్రాల సంతోష్ కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలని ఎంపీఓ పాక శ్రీనివాస్ అన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ సుశీల్ కుమార్, ఈసీ రాజు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన తొలిమెట్టు శిక్షణ తరగతులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఆరు రోజుల పాటు నిర్వహించబడిన తొలిమెట్టు శిక్షణ తరగతులు నేటితో ముగిశాయని పర్వతగిరి మండల నోడల్ అధికారి గాయపు లింగారెడ్డి తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులందరూ తరగతి గదుల్లో అమలుపరచి విద్యార్థులు సులభమైన రీతిలో నేర్చుకొనుటకు తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీఎస్ఎస్ పర్వతగిరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎం.డి జలీల్, ఆర్పీలు శ్రీనివాస్, శ్రీదేవి, అన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ఎమ్మార్పీ సిబ్బంది శిల్ప, జయరాజ్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు సెర్ఫ్ ఉద్యోగుల అండ

## 150 కుటుంబాలకు పాత్రలు అందజేత

## డీఆర్‌డీఓ పిలుపుతో స్పందించిన ఉద్యోగులు



**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీఆర్డీఓ సెర్ఫ్ ఉద్యోగులు ఏటూరునాగారం వరద బాధితుల విషయంలో తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పంచాయతీ అధికారిగా సుదీర్ఘకాలం పనిచేసిన పద్మజారాణి ప్రస్తుతం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీఆర్డీఓ పీడీగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల భారీ వర్షాలు వరదలకు ఏటూరు నాగారం మండలం పరిధిలోని దొడ్ల, మల్యాల, కొండాయి గ్రామాలు వరద ముంచెత్తడంతో 8మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీఆర్డీఓ పీడీ పద్మజారాణి తను పని చేసిన జిల్లాలో జరిగిన ఘటనపై కలత చెందారు. తమ వంతుగా వారికి అండగా నిలవాలని భావించారు. జిల్లాలో పనిచేసే డీఆర్ డీఓ ఉద్యోగులకు విషయం వివరించి.. తోచినంత సహాయం చేయాలని.. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకుందామని పిలుపునిచ్చారు. దీంతో స్పందించిన ఉద్యోగులు తమ ఉదారతను చాటుకున్నారు. సుమారు రూ.1.50లక్షలు సేకరించారు. ఈ మొత్తం డబ్బులతో నేరుగా కంపెనీల వద్దకు వెళ్లి వంట సామాగ్రి కొనుగోలు చేసి ప్రత్యేకంగా ప్యాకింగ్ చేయించి వాహనంలో ఏటూరునాగారం తరలించి స్థానికుల సహకారంతో వరద బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన సెర్ఫ్ ఉద్యోగులను పీడీ పద్మజారాణి ప్రత్యేకంగా అభినందించారు. ఉద్యోగులు మాట్లాడుతూ బాధితులకు సహకారం అందిస్తున్న క్రమంలో వారు ఎంతో సంతోషించారని వారికి తమ వంతు సహకారం అందించే అవకాశం కల్పించిన పీడీకి ధన్యవాదాలు తెలిపారు. ముంపు బాధితులను ప్రతి ఒక్కరూ పెద్ద మనసుతో ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీఆర్ డీఏ సిబ్బంది, సెర్ఫ్ సిబ్బంది, యంజియన్ఆర్ ఈజీయస్ సిబ్బంది లత, డీపీఎం శీలం ప్రభాకర్, డీపీఎం తెలుగు మునిస్వామి, ఏపీఎం ఆర్.రామ చంద్రారెడ్డి, రాజేశ్ లు, ఉద్యోగులు అందరి పక్షాన తాము వచ్చి బాధితులకు అందజేస్తున్నట్లు తెలిపారు.

# బూత్ కన్వీనర్లు కష్టపడి పనిచేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు డివిజన్ లోని బూత్ కన్వీనర్లు కష్టపడి పనిచేయాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. గురువారం డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్ అధ్యక్షతన ఉర్సు ప్రతాప్ నగర్ లో జరిగిన బూత్ కన్వీనర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం తలపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, వరంగల్ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు నన్నపునేని నరేందర్ చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చొరవతో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, బూత్ కన్వీనర్లు వనం మధు, కోరే కృష్ణ, మరుపల్ల గౌతం, ఓగిలి శెట్టి సంజీవ్, బైరగొని మనోహర్, వంగరి సురేష్, ఎండీ సలీం, గజ్జి సాంబయ్య , వెంగళ రాయనర్స్, శెట్టి మోహన్, అంకం దేవానంద్, కుండె కుమార్ లు ఉన్నారు.

# శాయంపేట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** స్థానిక పోలీస్ స్టేషన్‌ను వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ లో ఉన్న సన్నిహిత రిసెప్షన్, బెల్ ఆఫ్ అర్మ్స్, రికార్డ్స్ రూమ్, కోర్ట్ రూమ్, స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. పోలీస్ సిబ్బందిని వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

# ఫైలేరియా నిర్మూలన మాత్రల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 2వ డివిజన్ గుండ్ల సింగారంలో గురువారం జాతీయ ఫైలేరియా వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని స్థానిక కార్పోరేటర్ లావుడియా రవి నాయక్ ప్రారంభించి ఉచిత మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షా కాలంలో ప్రతి ఒక్కరూ కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంఖ్య అనుగుణంగా సర్దుబాటు చేయాలి

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ కమిటీని వేసి మధ్యంతర భృతిని ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పారిశుద్ధ కార్మికుల నియమించి, సీపీఎస్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. గత ఐదు ఏండ్లుగా నిలిచిన ఉపాధ్యాయ బదిలీలను వెంటనే చేపట్టాలన్నారు. మండలంలో ఉపాధ్యాయులు అక్రమ సర్దుబాటును రద్దు చేసి విద్యార్థుల సంఖ్య అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు.

# హామీలను మరిచి మళ్లీ అధికారం కోసం పాకులాట

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈనెల ఆరు వరకు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆసరా పెన్షన్ల పెంపు, రైతు రుణమాఫీ, గృహలక్ష్మి పథకం, బీసీలకు లక్ష రుణం, ఆర్టీసీలోని ఉద్యోగస్తులను ప్రభుత్వ ఉద్యోగులుగా, చేనేత మిత్ర పథకం, ఇమామ్లకు గౌరవ వేతనం పెంపు, వీఆర్ఏలను ఉద్యోగులుగా గుర్తించుట ఇవన్నీ కూడా రాబోయే ఎన్నికల ముందు ప్రజలను గారడి చేసి మరల గద్దెనెక్కాలని చేసి ప్రకటనలేనని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా హనుమకొండ జిల్లా కార్యదర్శి వంగరసాంబయ్య విమర్శించారు. శాయంపేట మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను పూర్తి చేయకుండా ఎన్నికల గారడి చేసి ప్రజలను బుట్టలో వేసుకోవాలని అధికార పార్టీ తహతహలాడుతుందని మండిపడ్డారు. ఇప్పటికైనా చట్టసభలలో జనాభా ప్రకారం అవకాశాలు, చేనేతపై జీఎస్టీ పన్నులు తొలగించుట, రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించుట, అర్హులైన చేనేత వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేట్టు చర్యలు తీసుకొని, పద్మశాలి బంధును,



చేనేత పారిశ్రామిక సంఘాల్లో క్యాష్ క్రెడిట్ రుణమాఫీకి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. గృహలక్ష్మి గడువును 15రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా హనుమకొండ జిల్లా కార్యదర్శి వంగర సాంబయ్య, శాయంపేట మండల కార్యదర్శి తట్ల రమేష్, ఆడెపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గూడెంలో ఎమ్మెల్యే 'దుద్దిళ్ళ'పల్లె నిద్ర



**వరంగల్ వాయిస్, కాటారం:** మంథని ఎమ్మెల్యే, మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి దుద్దిల్ల శ్రీధర్ బాబు దట్టమైన దండకారణ్య ప్రాంతంలోని గిరిజన గూడెంలో పల్లె నిద్ర చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన గూడెంలో నిద్రించి పల్లె వాసులతో శ్రీధర్ బాబు ముచ్చటించారు. వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. గిరిజన ఆదివాసీ సంరక్షణ హస్తం కార్యక్రమానికి విచ్చేసిన శ్రీధర్ బాబు కు ఆదివాసీ గిరిజనలు స్వాగతం పలికారు. మంథని నియోజకవర్గంలో మహముత్తారం మండలం మాదారం గ్రామంలో ప్రపంచ ఆదివాసీల దినోత్సవ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన గిరిజన ఆదివాసీ సంరక్షణ హస్తం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రాచీన చరిత్రకు, సంస్కృతికి, సంప్రదాయాలకు, నిలువుటద్దంగా నిలిచే జీవన శైలి ఆదివాసుల సొంతమని అన్నారు. కాంగ్రెస్అధికారంలోకి రాగానే ఆదివాసీలకు హక్కు పత్రాలు కల్పించడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

# విలేజి బస్సు ఆఫీసర్లకు శిక్షణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, వరంగల్ రీజియన్ విలేజి బస్సు ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం వరంగల్ రీజనల్ మేనేజర్ జె .శ్రీలత ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా తొమ్మిది డిపోల నుంచి హాజరైన 52మంది విలేజి బస్సు ఆఫీసర్ లను ఉద్దేశించి మాట్లాడుతూ సంస్థకు ప్యాసింజర్ అతి ముఖ్యమైన వ్యక్తి, ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్యను పెంచడానికి ప్యాసింజర్లకు, సంస్థకు మధ్య అనుసంధాన కర్తగా విలేజి బస్సు ఆఫీసర్లు వ్యవహరించాలని, ఆర్టీసీకి సంబంధించిన వివిధ రకాల మార్కెటింగ్ స్కీములు, బస్సు పాసుల రాయితీలు, ప్రత్యేక బస్సుల బుకింగ్ వంటి వివిధ సదుపాయాలు గురించి వారికి కేటాయించిన వివిధ గ్రామ ప్రజలకు తెలియజేస్తూ, విలేజి బస్సు ఆఫీసర్లు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం(ఓ) బి.కృపాకర్ రెడ్డి, డిప్యూటీ ఆర్ ఏం(ఎం ) జి.మాధవ రావు, ప్రిన్సిపాల్ వి.మోహన్ రావు, జడ్ఎస్ టీసీ డి.మురలీధర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు విష్ణు కుమార్, లెక్చరర్ తదితరులు పాల్గొన్నారు.

గురువారం 10, ఆగస్టు 2023
www.warangalvoice.net

# బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం

## ఎమ్మెల్యే రెడ్యానాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించామని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. గురువారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు అతిథి గృహంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ (2018-19) నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల పేద ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు, ఎంపీపీ గుగులోతు అరుణ రాంబాబు, మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ మహేందర్ రెడ్డి, ఎంపీడీవో కేలోతు ధన్ సింగ్, సూపరిడెండెంట్ శేశైలం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే రెడ్యా డోర్నకల్ మండల పర్యటన..**

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండలంలో గురువారం నుంచి ఎమ్మెల్యే రెడ్యానాయక్ పర్యటన ప్రారంభిస్తున్నామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నున్న వెంకటరమణ తెలిపారు. గురువారం వరంగల్ వాయిస్ తో ఆయన మాట్లాడుతూ శుక్రవారం చిల్కోయలపాడు గ్రామం నుంచి ఈ యాత్ర ప్రారంభించి ఈ నెల 19న అహ్మద్ నగర్ గ్రామ పర్యటనతో ముగుస్తుందని వివరించారు. రెండు రోజుల వ్యవధి తర్వాత పట్టణంలో ఈ పర్యటన కోనసాగుతుందన్నారు. మండలంలోని బీఆర్ఎస్ గ్రామాధ్యక్ష కార్యదర్శులు, సర్పంచులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మార్కెట్ చైర్మన్ కత్తెరశాల విద్యాసాగర్, ఎంపీపీ బాలు నాయక్, మున్సిపల్ చైర్మన్ వాంగుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, సోసైటీ అధ్యక్షుడు భిక్షం రెడ్డి, నాయకులు సత్తి రెడ్డి, రాంనాథం, రాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గోన్నారు.

## కార్యకర్తకు వినయ్ భాస్కర్ పరామర్శ



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట పట్టణం 47వ డివిజన్ భవాని నగర్ కి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, కార్మిక నాయకుడు బైరి శ్రీనివాస్ అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొంది ఇటీవలే ఇంటికి వచ్చారు. సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ శ్రీనివాస్ స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని శ్రీనివాస్ కు భరోసానిచ్చారు. అనంతరం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ నిత్యం కార్యకర్తలకు అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చినా వెన్నంటే వుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, సిరిల్ లారెన్స్, మర్యాల కృష్ణ, దువ్వ కనకరాజు, దువ్వ నరేష్, గోల్కొండ రాంబాబు, జెరిపోతుల వెంకన్న, భుషపాక శ్రీనివాస్, దుప్పటి శివ కుమార్, భిక్షపతి, వాసు, సతీష్, మైలరం శంకర్, ఎండీ మదీస్, సల్లూరి నాగేష్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావాలి

**వరంగల్ వాయిస్, రాయపర్తి :** తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశం కోసం రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న ఎంపికలో భాగంగా మండల, జిల్లా స్థాయిలో రాణించి ఈ నెల 9,10 తేదీలలో హకీంపేట స్పోర్ట్స్ స్కూల్లో నిర్వ హించిన రాష్ట్ర స్థాయి ఎంపికలో రాయపర్తి మండలం నుంచి ప్రాథమిక పాఠశాల సన్నూర్ విద్యార్థి చిన్నపల్లీ శ్రేయాన్, ప్రాథమిక పాఠశాల జయరామ్ తండా (కె) విద్యార్థిని గుగులోత్ డింపుల్ ఇద్దరు పాల్గొన్నారని ఎంఈఓ రంగయ్య తెలియజేశారు. కాగా ఈ విద్యార్థులకు హెచ్ఎంలు పనికర వెంకన్న, బాదావత్ రాజు, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేసింది. రాష్ట్రస్థాయిలో కూడా ఎంపిక కావాలని శుభాకాంక్షలు తెలిపారు.

## సామాజిక న్యాయ శిఖరం పుంజల శివశంకర్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** భారత సామాజిక న్యాయ శిఖరం పుంజల శివశంకర్ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నాడు. మానుకోట జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో గురువారం పుంజల శివశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. శివశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాంశెట్టి ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శంతన్ రామరాజు మాట్లాడుతూ 1929లో హైదరాబాద్ లోని మామిడిపల్లిలోఅత్యంత నిరుపేద కుటుంబంలో పుట్టిన శివశంకర్ పట్టుదలతో 1952లో న్యాయశాస్త్ర విద్యను చదివి 1980లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారన్నారు. ఇందిరాగాంధీ మంత్రివర్గంలో పనిచేసిన శివశంకర్ భారత న్యాయ వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని అన్నారు. కేంద్ర,వాణిజ్యశాఖా మంత్రిగానూ పనిచేసిన శివశంకర్ బీసీల హక్కుల కోసం పోరాడిన ధీశాలి అని కొనియాడారు. 1972లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 25శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కీలక భూమిక పోషించారన్నారు. ఆ తర్వాత ఆనంతరామన్ కమిషన్ బీసీలకు 30శాతం రిజర్వేషన్లు కల్పించాలని సూచన చేయగా అవి చెల్లవంటూ హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈక్రమంలో రంగంలోకి దిగిన శివశంకర్ సుప్రీంకోర్టులో స్వంత ఖర్చులతో 18 నెలలు పోరాడి 30శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చి బీసీల బతుకుల్లో వెలుగులు నింపాడని ఆయన సేవలను కొనియాడారు. శివశంకర్ పోరాటంతోనే బీసీల్లో ఏబీసీడీ వర్గీకరణ జరిగి నిమ్న కులాలకు న్యాయం జరిగిందని అన్నారు. తన జీవితాంతం పేదప్రజల తరపున పోరాడిన శివశంకర్ 2017 ఫిబ్రవరి 27న 87ఏట మరణించడం బడుగుబలహీన వర్గాలకు తీరని లోటని అభివర్ణించారు. యువ నేతలు పిట్టల శ్రీకాంత్ పటేల్, రామరాజు ఉపేందర్ పటేల్, రావిశెట్టి చంద్రశేఖర్ పటేల్, మైదం వీరన్న, బాషికార్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండల ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ కు రాబోవు 3ఏళ్లకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ తెలిపారు. మరిపెడ మండలంలోని గుండెపుడిలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు షేక్ ఫక్రుద్దీన్, ప్రధాన కార్యదర్శి బాధవత్ భద్రు, కోశాధికారి జాటోతు నరేష్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు నీలం రమేష్, మాజీ అధ్యక్షుడు బోడపట్ల లింగన్న, సీనియర్స్ రహిమోద్దీన్, సభ్యులు పగిళ్ల శ్రీను, బ్రహ్మం, దశరథ, శ్రీకాంత్, రమేష్ , నరేందర్, హెచ్ డి రవి, మధు, నాగ, రాజా, రవి పాల్గొన్నారు



## శాయంపేట తహసీల్దార్‌గా సుభాషిణి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** వచ్చే శాసనసభ సాధారణ ఎన్నికల బదిలీలో భాగంగా గురువారం శాయంపేట మండల తహసీల్దారుగా జె.సుభాషిణి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సీహెచ్ రాజు కరీంనగర్ కు బదిలీపై వెళ్లారు.

## 152 మంది ముస్లింలకు రుణాల మంజూరుకు ప్రతిపాదనలు

### ఎంపీపీ బి.రాణీబాయి రామారావు

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మైనార్టీ బంధు పథకం ద్వారా మహాదేవపూర్ మండలంలోని 152మంది ముస్లిం నిరుద్యోగ యువతకు రూ.లక్ష మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీపీ బి.రాణీబాయి రామారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొత్తంలో మహాదేవపూర్ లోనే అత్యధికంగా ముస్లింలు ఉన్నారని, జిల్లాలో ఎక్కువ మొత్తం మైనార్టీ బంధు మహాదేవపూర్ కే కేటాయించాలని జిల్లా మంత్రి సత్యవతి రాథోడ్ కు, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు విజ్ఞప్తి చేశామని ఎంపీపీ రాణీబాయి రామారావు తెలిపారు. మండల కేంద్రమైన మహాదేవపూర్ లో 118 మందికి, కాళేశ్వరం లో 14 మందికి, అన్నారంలో 6గురికి, రాపల్లికోటలో 5గురికి, అంబట్ పల్లి లో ఇద్దరికీ, సూరారంలో ఇద్దరికీ, యాన్కపల్లిలో ఇద్దరికీ మైనార్టీ బంధు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపినట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావును కలిసిన దాసరి రాజేష్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావును గురువారం నగరానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దాసరి రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్ష పదవిఇవ్వాలని ఆయన్ని అభ్యర్థించారు.

## ఫోక్సో కేసు నిందితుడికి జైలు శిక్ష


**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండలంలోని చిల్కోడు గ్రామానికి చెందిన ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి మహబూబాబాద్ జిల్లా న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. బయ్యారం మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన కత్తుల వాసు చిల్కోడు గ్రామంలోని ఓ యువతిపై లైంగిక దాడి పాల్పడ్డాడనే ఆరోపణతో డోర్నకల్ పోలీసులు కేసు నమోదు చేసి గత ఏడాది జూలై 10న న్యాయ స్థానం ముందు హాజరుపరిచారు. కేసు దర్యాప్తు చేసిన అనంతరం పోలీసులు చార్జీ షీట్ దాఖలు చేశారు. కేసులోని సాక్షులను విచారించిన సదరు న్యాయ స్థానం కేసు పుర్వాపరాలను పరిశీలించి నిందితుడికి 20సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేల జరిమాన విధించారు. రూ.5వేలు కట్టని ఏడల శిక్ష మరో నెల పెంచుతూ తీర్పు వెలువరించారు. ప్రిన్సిపల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి, స్పెషల్ జడ్జి ఫర్ ఫోక్సో కేసు న్యాయమూర్తి చంద్ర శేఖర్ ప్రసాద్ తీర్పునిచ్చారు. ఈ కేసుకు పబ్లిక్ ప్రాసీక్యూటర్ గా పద్మాకర్ రెడ్డి వ్యవహరించగా అప్పటి సీఐ వెంకటరత్నం కేసు విచారణ జరిపించగా ప్రస్తుత సీఐ ఉపేందర్ సాక్షులను న్యాయస్థానాల్లో హాజరు పరిచారు.

## రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని వివిధ గ్రామాల్లోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు గురువారం పరకాల రూరల్ సీఐ డి.మల్లేష్, ఎస్.ఐ దేవేందర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్ లో భాగంగా వారి నడవడిక మార్చుకోవాలని, సమాజంలో మంచిగా జీవించాలని, ఎటువంటి నేరాలు పాల్గొనకూడదని, సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అదేవిధంగా ఏదైనా నేరాల్లో పాల్గొనట్లయితే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నయా లుక్.. అదిరిపోలా



ఎన్టీఆర్ న్యూ లుక్ ను గమనించారా.. ఎలా ఉన్నాడో.. తాజాగా తారక్ కొత్త అవతారం వైరల్ అవుతోంది. ఆర్ఆర్ఆర్ లాంటి సినిమాతో గ్లోబల్ ఇమేజ్ సాధించిన ఎన్టీఆర్.. వరుస ప్రాజెక్ట్ లను లైన్ లో పెట్టాడు. ఫుల్ జోష్ తో దూసుకుపోతున్నాడు. ఇటు సినిమాలు చేస్తూ.. అటు ఫేమస్ బ్రాండ్స్ కు అంబాసిడర్గా ఎన్టీఆర్ ఫుల్ జోష్ లో ఉన్నాడు. ఒక పక్క బ్లాక్ బస్టర్ కాంబినేషన్ లో సినిమాలు సెట్ చేస్తూనే.. మరోపక్క కమర్షియల్ యాడ్స్ తో కూడా అదరగొడుతున్నాడు.
ఈ క్రమంలోనే అటు జ్యూవ్వల్లరీ యాడ్ తో పాటు.. ఫుడ్ యాప్స్..డ్రింక్స్‌కు సబంధించిన ఫేమస్ బ్రాండ్స్‌ను అడ్వటైజ్ చేస్తున్నాడు. ఈమధ్య ఎన్టీఆర్ ఖాతాలో మరిన్ని బ్రాండ్స్ వచ్చి చేరాయి. ఇప్పటికే లీషియస్, యాపీ ఫిజ్ మెక్ డొనాల్డ్స్ వంటి యాడ్స్ తో బిజీ అయిపోయాడు. ఈ యాడ్స్ కోసం కొత్త కొత్త లుక్స్ ను ట్రై చేస్తున్నాడు ఎన్టీఆర్. తాజాగా ఆయన ఖాతలో మరో ప్రాడెక్ట్ యాడ్ అవ్వడంతో.. దానికి సబంధించిన షూట్ జరిగింది. ఈ షూట్ లో తారక్ డిఫరెంట్ లుక్ లో కనిపించాడు. ఈ యాడ్ లో ఎన్టీఆర్ స్టైలిష్ గా కనిపించేలా ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ అలీమ్ హకీమ్.. ఎన్టీఆర్‌ని అదిరిపోయే లుక్స్ లో రెడీ చేశాడు. గడ్డం, కళ్ళజోడు, వావ్ అనిపించే హెయిర్ స్టైల్ తో ఎన్టీఆర్ సూపర్ ఉన్నాడు. ప్రస్తుతం ఎన్టీఆర్ తాజా లుక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అంతే కాదు ఎన్టీఆర్ కు సబంధించిన మరో న్యూస్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. తారక్ ఒక్కో యాడ్ కోసం దాదాపు 8 కోట్లు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. యాడ్ కే ఇంత డియాండ్ చేస్తున్నాడంటే.. ముందు ముందు సినిమాలకు ఎంత తీసుకుంటాడా అని అనుకుంటున్నాడు.

## గన్స్ అండ్ గులాబ్స్ ..



'మహనటి', సీతారామం చిత్రాలతో తెలుగువారికి చేరువైన మలయాళీ నటుడు దుల్కర్ సల్మాన్ స్త్రీ, మోనికా, ఓ మై డార్లింగ్ లాంటి మూవీలతో హిట్ కొట్టిన రాజ్ కుమార్ రావు లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న సరికొత్త వెబ్‌సిరీస్ 'గన్స్ అండ్ గులాబ్స్' ఇప్పటికే ఈ సిరీస్ నుంచి ఫస్ట్ లుక్, టీజర్‌లను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇక ఈ వెబ్‌సిరీస్‌కు సంబంధించిన హిందీ ట్రైలర్‌ను గత బుధవారం విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సిరీస్ తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ట్రైలర్ గమనిస్తే.. ఈ వెబ్ సిరీస్‌లో స్టైలిష్ పోలీసుగా కనిపించనున్నారు దుల్కర్ సల్మాన్. ఈ స్టార్ హీరోకు ఇదే మొదటి వెబ్ సిరీస్. గులాబ్ గంజ్ అనే ప్రాంతంలో గ్యాంగ్‌స్టర్స్‌కు, పోలీసులకు మధ్య జరిగిన పోరాటం ఆధారంగా ఈ క్రైమ్ సిరీస్‌ను రూపొందించినట్లు ట్రైలర్ చుస్తే తెలిసిపోతుంది. పాన టిప్పు అనే పాత్రలో గ్యాంగ్‌స్టర్‌గా రాజ్ కుమార్ రావు అలరించనున్నాడు.

## హాట్ కేకుల్లా జైలర్ టిక్కెట్ల అమ్మకాలు



సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'జైలర్' ఈ ఏడాది యూఎస్ బాక్సాఫీస్ దగ్గర చరిత్ర సృష్టించే దిశగా దూసుకుపోతోంది. తాజాగా అందిన సమాచారం ప్రకారం ఈ చిత్రం యూఎస్ ఏ బుకింగ్‌లకు సూపర్ రెస్పాన్స్ వస్తోంది. 1 మిలియన్ డాలర్స్ మార్క్ దిశగా దూసుకెళ్తోంది. ఈ జైలర్ చిత్రం ప్రీమియర్స్ మరి కొన్ని గంటల్లో యూఎస్ ఏ బాక్సాఫీస్ ముందు ప్రదర్శన కానుంది. ఇప్పటికే విడుదల ఈ సినిమా సాంగ్స్, ట్రైలర్ విపరీతంగా ఆకట్టుకున్నాయి. తమన్నా గ్లామర్, రజనీకాంత్ వింటేజ్ లుక్ కు మంచి రెస్పాన్స్ వచ్చాయి. ఇప్పటికే తమన్నా 'కావాలా సాంగ్' సోషల్ మీడియాలో రీల్స్, షార్ట్స్ రూపంలో ఫుల్ ట్రెండ్ అవుతోంది. అలాగే రీసెంట్ గా ట్రైలర్ రిలీజ్ తర్వాత రజనీకాంత్ గట్టి కమ్ బ్యాక్ ఇవ్వడం ఖాయమనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. దీంతో ఈ సినిమాకు భారీ అంచన్నాలు ఏర్పడ్డాయి. దీంతో ఈ అంచనాల నడుమ ఓవర్సీస్‌లోనూ ఈ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్ భారీగా జరుగుతోంది. అమెరికా, బ్రిటన్, సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, దుబాయ్ సహా ఇతర దేశాల్లో మంచి క్రేజ్ కనిపిస్తోంది. ఈ క్రమంలోనే యూకే, అమెరికాలో ప్రీమియర్స్ కు భారీగా స్పందన లభిస్తోంది.ఒకవేళ ఈ జైలర్ చిత్రం 1 మిలియన్ డాలర్స్ మార్క్ ను అందుకుంటే.. ఇకపోతే ఈ జైలర్ సినిమాలో రజనీకాంత్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మోహన్ లాల్, బాలీవుడ్ యాక్టర్ జాకీ ష్రాఫ్, కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్, టాలీవుడ్ కమెడియన్ సునీల్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. సుమారు రూ. 200 కోట్ల బడ్జెట్ తో రూపొందించారని తెలిసింది.

## పాగలోల్లను చేస్తుంది



అసలే పోరగాల్లు, ఎప్పుడు ఎట్లుంటరో దెల్వదు, గసొంటోల్లను పాగలోల్లను చేస్తుంది గీ పోరి.. విశ్వక్ సేన్ హీరోగా వొచ్చిన పాగల్ సినిమా తోనే పోరగాండ్లకు దిమాక్ లు కరాబ్ జేసింది గీ పొల్ల సిమ్రాన్ చౌదరి. జర గీ బ్యూటీ గురించి నాలుగు ముచ్చట్లు జెప్పుకుందాం.. తాజాగా ఈ ముద్దుగుమ్మ టెంప్టింగ్ ఫోజులతో గుండెలు గుల్లజేసేందుకు సోషల్ మీడియాలో ఫోటో ఫోజులిచ్చింది. గంతే గప్పట్నుంచి పోరగాండ్లు ఆగమాగం అవుతున్నరు. 'ఈ నగరానికి ఏమైంది?' హీరోయిన్ సిమ్రాన్ చౌదరి సోషల్ మీడియాలో అందాల జాతర చేస్తోంది. తాజాగా ఈ బ్యూటీ పంచుకున్న పిక్స్ స్టన్నింగ్‌గా ఉన్నాయి. నెట్టింట వైరల్‌గా మారాయి. టాలీవుడ్ యంగ్ హీరోయిన్ సిమ్రాన్ చౌదరి 'ఈ నగరానికి ఏమైంది' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. చిన్న సినిమాగా వచ్చిన ఈ చిత్రం యూత్ లో సెన్సేషన్ క్రియేట్ చేసింది. రీసెంట్ గా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రీరిలీజ్ కూడా జరిగింది. విశ్వక్ సేన్ సరసన నటించిన పాగల్ సినిమాలో నటన పరంగా, అందం పరంగా మెప్పించింది. హీరోయిన్ గా గుర్తింపు దక్కించుకుంది. ఆ చిత్రం తర్వాత మరిన్ని సినిమాల్లో అవకాశాలు అందుకుంది. కానీ పెద్ద హిట్లు సాధించలేకపోయింది. ఇప్పటి వరకు ఆరు చిత్రాల్లో నటించిన సిమ్రాన్ చౌదరికి 'ఈ నగరానికి ఏమైంది' సినిమానే గుర్తింపు తెచ్చిపెట్టింది. ఇక అలాంటి హిట్ కోసం ఎదురుచూస్తోంది. ప్రస్తుతం పెద్దగా చేతిలో సినిమాలు కూడా లేకపోవడంతో అవకాశాల వేటలో పడింది. ఈ సందర్భంగా సిమ్రాన్ చౌదరి సోషల్ మీడియాలో మాత్రం ఎప్పుడూ యాక్టివ్ గా కనిపిస్తోంది. వరుసగా పోస్టులు పెడుతూ దర్శకనిర్మాతల కంట్లో పడేలా చేస్తోంది. మరోవైపు స్టన్నింగ్ అవుట్ ఫిట్లు ధరిస్తూ ఫొటోషూట్లు చేస్తోంది. నయా లుక్స్ తో కుర్రాళ్లను కట్టిపడేస్తోంది. పలుచటి డ్రెస్ లో సిమ్రాన్ చౌదరి అదరిపోయేలా ఫొటోషూట్ చేసింది. హాట్ సిట్టింగ్ ఫోజుల్లో కుర్రాళ్ల హార్ట్ బీట్ పెంచేసింది. థైస్ షోతో మతులు పోగొట్టింది. టెంప్టింగ్ లుక్ తో నెటిజన్లను తనవైపు తిప్పుకుంది. ఈ క్రమంలో అవకాశాల కోసం కూడా ఎదురుచూస్తున్నట్టు కనిపిస్తోంది. 'అథర్వ' అనే చిత్రంలో నటిస్తున్న తెలుస్తోంది. దీనికి సంబంధించిన అప్డేట్స్ రావాల్సి ఉంది.

గురువారం 10, ఆగస్టు 2023
www.warangalvoice.net

# కార్మిక చట్టాల పరిరక్షణకు సమరశీల పోరాటాలు

## కలెక్టరేట్ ఎదుట రెండో రోజు ధర్నా




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కార్మిక చట్టాల పరిరక్షణకై సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట భిక్షపతి, సీఐటీయూ జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి, బీఆర్ టీయూ జిల్లా నాయకులు నాయిని రవి, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు అప్పారావు అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కేంద్రంలో కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రెండో రోజు జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాసమస్యలను, కార్మికవర్గ సమస్యలను గాలికొదిలేసి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని ఆరోపించారు. దీనివలన నిరుద్యోగం, కనీసవేతనం, గిట్టుబాటు ధర, ద్రరిథ్యం, వలస లాంటి సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఏఐటీయూసీ జిల్లా అద్యక్షుడు జక్కు రాజు గౌడ్, కార్మిక సంఘాల నాయకులు దర్మల రామ్మూర్తి, మంచాల తిరుపతి, శంకర్, వేల్పుల సారంగపాణి, సంపత్, రవి, నాయిని రవి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

## పోలీసుల అదుపులో సహకరించిన మరో ముగ్గురు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** తాళం వేసివున్న ఇండ్లల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగతో పాటు చోరీ సొత్తును కొనుగోలు చేసినందుకుగాను మరో ముగ్గురు నిందితులను మడికొండ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. 7లక్షల విలువ కలిగిన 103 గ్రాముల బంగారం, 824 గ్రాములు వెండి ఆభరణాలతో పాటు, రెండు ఐప్యాడ్లు, రూ.19వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి సెంట్రల్ జోన్ డీసీపీ మహమ్మద్ అబ్దుల్ భారీ వివరాలను వెల్లడిస్తూ.. పోలీసులు అరెస్టు చేసిన ప్రధాన నిందితుడు కడప జిల్లా సిద్ధపుట్ మండలం బాక్రాపేట గ్రామానికి చెందిన పంతగిరి రాజా అలియాస్ నాగరాజు రోజువారి కూలీ చేసేవాడు. గతంలో తనకు వచ్చే అదాయం తన జల్సాలకు సరిపోకపోవడంతో తన అన్నయ్యతో కలిసి కడప జిల్లాలో ఎర్రచందనం, కరెంట్ తీగలను చోరీ చేసేవాడు. రాజాను పలుమార్లు పోలీసులు అరెస్టు చేయడంతో పాటు, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ పోలీసులు పీడీయాక్ట్ క్రింద జైలుకు తరలించారు. జైలు విడుదలైనయ తరువాత నిందితుడు దేవాలయాల్లోని హుండీ డబ్బులు చోరీ చేయడంతో కనిగిరి, ఎలిగండ్ల పోలీసులు మరో సారి అరెస్టు చేసి జైలు పంపారు. బయటికి వచ్చాక ఆంధ్రలో చోరీలకు పాల్పడితే పోలీసులు గుర్తిస్తారని, గత నెల జూన్ మాసంలో కాజీపేటకు వచ్చి తిలకనగర్ లో నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. పగటి వేళల్లో బొగ్గు కాల్చేవాడు. రాత్రి సమయాల్లో తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి తాళం పగులగొట్టి ఇంటిలోని బంగారు, వెండి, ఇతర వస్తువులను చోరీ చేసేవాడు. ఈ విధంగా నిందితుడు మొత్తం ఆరు దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇందులో మడికొండ, కాజీపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు చొప్పున చోరీలు చేశాడు. నిందితుడు చోరీ చేసిన సొత్తును స్థానికంగా పరిచయం ఉన్న వరంగల్ ప్రాంతానికి చెందిన పోలిపాక సందీప్, ఆడెప్ రమేష్, కాజీపేటకు చెందిన సాతూరి వెంకటేశ్వర్లకు విక్రయించి సొమ్ము చేసుకోనేవాడు. గురువారం ఉదయం మడికొండ, ధర్మసాగర్ మార్గంలోని పెద్దమ్మ గుడి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న మడికొండ పోలీసులకు అనుమానస్పదంగా కనిపించిన నిందితుడిని పోలీసులు తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకోని విచారించగా నేరాన్ని అంగీకరించడంతో పాటు ఇతను ఇచ్చిన సమాచారంలో మిగితా ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

# స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరగాలి

## జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాట్లు పక్కగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు వివిధ శాఖల ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాల జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ పి.ప్రావీణ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ స్థానిక ఐడీఓసీ నిర్మాణ స్థలంలో జరగనున్న వేడుకలకు సంబంధించి పరేడ్, బందోబస్తు, భారీకేడింగ్, గౌరవ వందనం తదితర ఏర్పాట్లను పోలీస్ శాఖ వారు చేయాలన్నారు. గ్రౌండ్ క్లీనింగ్, వేదిక అలంకరణ, తాగు నీటి సౌకర్యం, పారిశుద్ధ పనులను జీడబ్ల్యూఎంసీ అధికారులకు ఇన్విటేషన్ కార్డ్స్, అవార్డ్స్ లిస్ట్ ప్రిపేర్ చేసే బాధ్యతలను అదనపు కలెక్టర్ రెవెన్యూకు అప్పగించారు. ప్రోటోకాల్, ఇన్విటేషన్ కార్డ్స్ అందరికి అందేలా చూడడం, వేదికపైన సీటింగ్, అలాగే స్వాతంత్ర సమర యోధులకు, ప్రెస్, అవార్డు గ్రహీతలకు, మొదలగు వారికి సీటింగ్, స్వాతంత్ర సమర యోధులకు సన్మానం తదితర పనులను వరంగల్ ఆర్డీఓను, పోలీస్ వారితో సమన్వయం చేసుకుంటూ బారికేడింగ్ ను సరిగ్గా ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను,దేశభక్తి గీతాల మీద సాంస్కృతిక ప్రదర్శన లు ఉండాలని డీఈఓ, డీపీఆర్ఓలను కలెక్టర్ ఆదేశించారు. వేడుకలకు వచ్చే ముఖ్య అతిథికి జిల్లా ప్రగతికి సంబంధించిన సందేశాన్ని తయారు చేయాలని, వేదిక వద్ద పబ్లిక్ అడ్రెస్ సిస్టం పెట్టాలని డీపీఆర్ఓను, వేడుకలకు వచ్చే వీవీఐపీ, వీఐపీ, ఆఫీసర్స్, ప్రెస్ వాళ్లకు రిఫ్రెష్ మెంట్ ఏర్పాటు చేయాలని సివిల్ సైప్లై అధికారులను ముందస్తు జాగ్రత్తలలో భాగంగా 108, 102, అంబులెన్స్, ఫస్ట్ ఏఐడీ కిట్ మెడికల్ టీంను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్ఓకు కలెక్టర్ తెలిపారు. 75వ భారత స్వాతంత్ర దినోత్సవ ముగింపు వేడుకల సందర్బంగా జిల్లాకు ఉన్న 3లక్షల మొక్కలను నాటేందుకు గ్రామాలలో, మండలాలో స్థలాన్ని ఎంపిక చేసి మొక్కలు పెట్టేందుకు గుంతలు తీసి రెడీగా పెట్టాలని కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీవత్స, డీసీపీ పి.రవీందర్, ఆర్డీవోలు, డీఆర్డీఓ పీడీ, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### పరిశ్రమల అనుమతులు జారీ చేయండి...

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పరిశ్రమల అనుమతులను నిర్దేశించిన సమయంలో జారీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్ లో డీఐపీసీ కమిటీ జరిగింది. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి, అనుమతులు ఇవ్వాలన్నారు. ఇటీవల అనుమతి ఇచ్చిన పరిశ్రమలపైన, సబ్సిడీపైన కమిటీతో కలెక్టర్ చర్చించారు. కొత్తగా అనుమతులు పొందిన 11 పరిశ్రమలు రూ.8.69 కోట్ల పెట్టుబడి పెట్టనున్నాయని, 78మందికి ఉపాధి కల్పించనున్నాయన్నారు. టీప్రైడ్ స్కీం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు గాను 8మంది లబ్ధిదారులకు రూ.24.12లక్షల సబ్సిడీ మంజూరు చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశం లో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నర్సింహమూర్తి, ఎంపీఐ రవీందర్, ఎల్ డీఎం రాజు, డీటీసీపీ అధికారి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్ అండ్ హెచ్ఎం స్కీములో దాదాపు 15వేల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిన వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్నారని, గత 20సంవత్సరాలుగా పనిచేస్తున్న వీరందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, యూనియన్ ఎన్ హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గురువారం కోటిలోని కమిషనర్ కార్యాలయం ముందు వందలాది మంది కార్మికులతో మహాధర్నాను నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్‌లో పీహెచ్ఎం స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, అకౌంటెంట్స్, సపోర్టింగ్ స్టాఫ్, ముగ్గురు మెడికల్ అసిస్టెంట్, ఎంఎన్ఓ, వాచ్‌మెన్ , స్వీపర్, బస్తీ దవఖానా స్టాఫ్‌నర్స్ సపోర్టింగ్ స్టాఫ్, బ్లడ్ బ్యాంకు డీఈఓ ల్యాబ్ అటెండర్, ఎస్ఎన్ సీయూ డీఈఓ, సెక్యూరిటీ గార్డ్స్, టీ హబ్ మేనేజర్, డీఈఓ, సపోర్టింగ్ స్టాఫ్, బ్లాక్ లెవెల్ అకౌంటెంట్స్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలు, ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్సులు, ఎన్ ఆర్‌సీ న్యూట్రిషన్ కౌన్సిలర్, సెక్యూరిటీ గార్డ్ సపోర్టింగ్ స్టాఫ్, పీహెచ్‌సీ డీఈఓ కాంటిజెంట్ వర్కర్స్, డీఐఈసీ సైకాలజిస్ట్ , డెంటిల్ టెక్నీషియన్, ఎర్లీ ఇంటర్‌వెన్షనిస్ట్, సోషల్ వర్కర్ అప్తోమేట్రిస్ట్ ఫిజియోథెరపిస్టులు, ఎంసీహెచ్ ఓటీ అసిస్టెంట్, ఓటీ టెక్నీషియన్, సెక్యూరిటీ గార్డ్ సపోర్టింగ్ స్టాఫ్, ఆయుష్ ఎస్.ఎన్.ఓ, ఎఫ్ఎన్ఓ ఎస్‌టీఎల్ఎస్ టీబీ లెప్రసీ వింగ్ ఆల్ సూపర్‌వైజర్స్, ఆర్‌బీఎస్‌కే ఫార్మాసిస్టులు, ఏఎన్ఎంలు లాంటి అనేక క్యాడర్ల సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం చట్టం ప్రకారం జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు విడుదల చేసిన 510జీవో ద్వారా వీరికి తీవ్ర నష్టం జరిగిందని చట్ట ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనం ఈ సిబ్బందికి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. ఎన్ హెచ్ఎం స్కీములో పనిచేస్తున్న డాక్టర్లను ఏ మాదిరిగా రెగ్యులరైజ్ చేశారో.. అదే విధంగా మిగతా క్యాడర్ సిబ్బంది అందరిని కూడా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోవు రోజులు సమ్మెతో సహా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సెక్రటరీ దేవనబోయిన బాపు యాదవ్, బాలసుబ్రమణ్యం, సుమన్, నరసింహ, రేవతి , నీలిమా, మీనాక్షి , రజిత, మంజుల, సరస్వతి జయలక్ష్మి, మధు, జోగా లక్ష్మి, హారిక, భవాని, బాల కృష్ణమ్మ, పావని, సందీప్, స్వప్న, రాజేశ్వరి, సునీత, అనిత సాగర్, జైపాల్, శైలు, వరలక్ష్మి, ప్రసన్నకుమారి, భారతి, సునంద, రాము, రవీందర్, రామనాథం, ఏకుల చిరంజీవి, స్వప్న, జ్యోతి కృష్ణవేణి, సంధ్యారాణి, నిర్మల, జయలక్ష్మి, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జెండాలతో ప్రదర్శన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్ రెడ్డి ఆదేశానుసారం గురువారం వరంగల్ స్టేషన్ రోడ్ లోని తపాలా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ బాబు ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ప్రదర్శన చేశారు. హెడ్ పోస్ట్ ఆఫీస్ సమీపంలోని దుకాణదారులకు పార్టీ శ్రేణులతో కలిసి పంపిణీ చేశారు. పంద్రాగస్టు రోజు ప్రతి ఒక్కరూ వారి ఇళ్లపై జాతీయ జెండాలు ఎగురవేసి స్వతంత్ర అమరవీరులను స్మరించుకోవాలని తెలియజేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్ షా, జిల్లా ఉపాధ్యక్షుడు ఎరుకల రఘునారెడ్డి, కనుకుంట్ల రంజిత్, కార్యదర్శి ముంద్రాతి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బైరిమురళీ కృష్ణ, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుందర్, ఓం ప్రకాష్ కొలారియా, కండకట్ల మల్లికార్జున్, మామిడాల చంద్రమౌళి, వంగ సంపత్, గుర్రపు సత్యనారాయణ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com